సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 25 । మార్చి । 2023




పల్లెల్లో అవార్డుల సందడి
ప్రభుత్వం సూచించిన 9 అంశాల్లో ప్రతిభ కనబరిచిన పంచాయతీలను జిల్లా కమిటీ జాతీయ పురస్కారాలకు ఎంపిక చేసింది. 8లో



పాలకమండలికి మోక్షం
పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ పాలకవర్గానికి మోక్షం లభించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం జీఓ జారీ చేసింది. 10లో

గరిష్టం / కనిష్టం
35° / 24°

వాతావరణం
జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతాయి. గంటగంటకూ ఎండ ప్రభావం పెరుగుతుంది.



న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: శ్రీదేవీ వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీకనకదుర్గమ్మ(పెద్దమ్మ తల్లి)కు శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం చేశారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీచక్రార్చన, కుంకుమార్చన, లక్ష కుసుమార్చన, అభిషేకం, నివేదన, పంచ హారతులు, నీరాజన మంత్రపుష్పార్చన నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ, దుర్గాప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

శ్రీరామనవమికి పటిష్ట బందోబస్తు

కొత్తగూడెంటౌన్: ఈనెల 30, 31 తేదీల్లో భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేకం వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా పటిష్ట బందోబస్తు చేపడతామని ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. వివిధ అధికారులతో సమన్వయం పాటిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. బందోబస్తుకు కేటాయించిన విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఏఎస్పీలు టి.సాయి మనోహర్, విజయ్‌బాబు, పంకజ్ పరితోష్, డీఎస్పీలు రమణమూర్తి, వెంకటేష్, రాఘవేంద్రరావు, అబ్దుల్ రెహమాన్, నందీరామ్ పాల్గొన్నారు.

3,170 ఎకరాల్లో నష్టం

సూపర్‌బజార్(కొత్తగూడెం): అకాల వర్షాలకు జిల్లాలోని 90 గ్రామాల్లో 1,518 మంది రైతులకు చెందిన 3,170 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు శుక్రవారం నాటి వరకు నిర్వహించిన సర్వేలో తేలిందని వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. ఇందులో 45 మంది రైతులకు చెందిన 250 ఎకరాల్లో వరి, 1338 మందికి చెందిన 2,565 ఎకరాల్లో మొక్కజొన్న ఏడుగురికి చెందిన 15 ఎకరాల్లో పెసర, ఆరుగురికి చెందిన ఐదెకరాల్లో మినుము, ఆరుగురు రైతులకు చెందిన పదెకరాల్లో జొన్న, 116 మంది రైతులకు సంబంధించిన 325 ఎకరాల్లో పొగాకు పంటలకు నష్టం వాటిల్లిందని వివరించారు.

తిరుమలలో రేగుబల్లి వాసుల భజన

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామానికి చెందిన పాండవ కృష్ణ భజన మండలి సభ్యులు తిరుమలలో భజన నిర్వహించారు. ప్రతి ఏడాది ఈ గ్రామం నుంచి 15 మంది సభ్యులు గల బృందం తిరుమలలో భజన, పాటలు ఆలపిస్తారు. ధర్మ ప్రచారంలో భాగంగా తమకు ఈ అవకాశం దక్కడం అదృష్టమని మండలి అధ్యక్షుడు జెట్టి వెంకటరాజు అన్నారు.

27న నిధి ఆప్ కే నిఖత్

ఖమ్మం సహకారనగర్: ఎంప్లాయీస్ ప్రావిడెండ్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యాన ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27 'నిధి ఆప్ కే నిఖత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ. సలీంఖాన్ తెలిపారు. ఖమ్మం జిల్లా వాసులు వారు నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులైతే పాల్వంచలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9.30గంటలకు మొదలయ్యే కార్యక్రమంలో పాల్గొని సమస్యలు వెల్లడించవచ్చని పేర్కొన్నారు.

27న జెడ్పీ సమావేశం

చుంచుపల్లి: సబ్‌కా యోజనా..సబ్‌కా వికాస్‌లో భాగంగా జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ఈనెల 27న ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్మన్ కోరం కనకయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు సీఈఓ విద్యాలత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

చిక్కుల్లో సంత.. రాబడి లేక చింత !

వేలంలో రూ.50 లక్షలు పలికిన వారసంత

- ఒప్పంద సమయంలో తెరపైకి కొత్త నిబంధనలు
- దీంతో వెనక్కు తగ్గిన కాంట్రాక్టర్
- ఆదాయం కోల్పోయిన కొత్తగూడెం మున్సిపాలిటీ
- కొందరి మేలు కోసమే రూల్స్ మార్చారని ఆరోపణలు





'గూడెం' సంతలో వ్యాపారులు, వినియోగదారుల కోలాహలం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఏ గ్రేడ్ మున్సిపాలిటీగా కొనసాగుతున్న కొత్తగూడెంలో పాలన అస్తవ్యస్తంగా మారింది. కొందరు పాలకవర్గ సభ్యులు స్వలాభం కోసం పురపాలక ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారనే విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. పాలకవర్గం గతేడాది కాలంగా తీసుకుంటున్న నిర్ణయాలు వీటికి బలం చేకూర్చేలా ఉంటున్నాయి.

సంతకు ఎసరు..

కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో సింగరేణి ప్రధాన కార్యాలయం సమీపంలో ప్రతి ఆదివారం వారాంతపు సంత దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. ఈ సంతలో చిరు వ్యాపారులు సరుకులు అమ్ముకుంటుండగా వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు మేకలు, గొర్రెలు, ఆవులు, గేదెలు తదితర పశువులను ఇక్కడ విక్రయిస్తుంటారు. ఈ సంతలో జరిగే వ్యాపారాలు, పశువుల క్రయవిక్రయాలపై మున్సిపాలిటీ తరఫున పన్నులు వసూలు చేసేందుకు ప్రతి ఏడాది టెండర్ నిర్వహిస్తారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ తాను కోట్ చేసిన మొత్తాన్ని విడతల వారీగా మున్సిపాలిటీకి చెల్లిస్తారు. ఇందుకు ప్రతిగా సంతలో క్రయవిక్రయాలు జరిపే వ్యాపారుల నుంచి పన్ను వసూలు చేసుకుంటారు.

అసలు ట్విస్ట్ ఏంటంటే..

మున్సిపాలిటీ పరిధిలోని డెయిలీ మార్కెట్, వారాంతపు సంతలకు గతేడాది ఒకేసారి టెండర్లు ఆహ్వానించారు. డెయిలీ మార్కెట్‌ను 21 వార్డు కౌన్సిలర్ మాదా సత్యవతి భర్త, కాంట్రాక్టర్ అయిన మాదా శ్రీరాములు రూ.51 లక్షలకు దక్కించుకున్నాడు. దీని ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డుల్లో నిత్యం చిరు వ్యాపారుల నుంచి పన్ను వసూలు చేసుకునే హక్కు ఆయనకు దక్కింది. ఇదే సమయంలో వారాంతపు సంతను 36 వార్డు కౌన్సిలర్ భీమా శ్రీవల్లి భర్త శ్రీధర్ దక్కించుకున్నారు. ఇది మింగుడుపడని మున్సిపల్ పాలకవర్గంలోని కొందరు పెద్దలు వారాంతపు సంతలో సైతం మాదా శ్రీరాములుకు వాటా దక్కేలా పావులు కదిపారనే ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి.

కొత్త నిబంధనలు..

ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వారాంతపు సంత టెండర్ ప్రక్రియ 2022 జూలైలో నిర్వహించారు. ఇందులో అత్యధికంగా రూ.50 లక్షలు కోట్ చేసిన 36వ వార్డు కౌన్సిలర్ భీమా శ్రీవల్లి భర్త, కాంట్రాక్టర్ భీమా శ్రీధర్‌కు టెండరు దక్కింది. అయితే టెండర్ నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు లేని కొత్త నిబంధనలు టెండర్ దక్కించుకుని ఒప్పంద పత్రం రాసుకునే సమయంలో చేర్చారు. దీని ప్రకారం వారాంతపు సంత దక్కించుకున్న కాంట్రాక్టర్ కేవలం పశువుల క్రయవిక్రయాలపైనే పన్నులు వసూలు చేయాలి. అదే సంతలో కూరగాయలు, బట్టలు, ధాన్యాలు, పండ్లు, పూలు తదితర వస్తువులు అమ్మే చిరు వ్యాపారుల నుంచి పన్ను వసూలు చేయొద్దనే నిబంధన చేర్చారు. కొత్తగా తెరపైకి వచ్చిన ఈ నిర్ణయంతో టెండరు దక్కించుకున్న భీమా శ్రీధర్ వెనక్కి తగ్గారు. మున్సిపాలిటీతో ఒప్పందం చేసుకోలేదు.

హోల్‌సేల్ మార్కెట్ వంకతో..

సెవెన్ హిల్స్ దగ్గర ఉన్న కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ను ఇటీవల వారాంతపు సంత నిర్వహించే ప్రాంగణంలోకి మార్చారు. సంత ప్రాంగణంలో ఉన్న కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌లో నిత్యం వ్యాపారం జరుగుతుందనే సాకుతో సంత పాటను కేవలం పశువుల క్రయవిక్రయాలకే పరిమితం చేశారు. ఇలా వారాంతపు సంతను వట్టిపోయేలా చేశారు. ఫలితంగా పలుమార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం కొత్తగూడెం మున్సిపాలిటీ రూ.50 లక్షల ఆదాయాన్ని కోల్పోయినట్టయింది.

అన్నింటా అదే తంతు..

ఇప్పటికే డెయిలీ మార్కెట్‌కు సంబంధించి రూ.31 లక్షలు చెల్లించని కాంట్రాక్టర్‌పై ఏ విధమైన చర్యలు తీసుకోకుండా పాలవవర్గం, మున్సిపల్ అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు వారాంతపు సంతలో నిబంధనల పేరుతో రూ. 50లక్షల వరకు ఆదాయం కోల్పోయింది. కబేలా పాట విషయంలోనూ ఇదే తంతు కొనసాగుతోంది. ప్రజల సమస్యలు తీరుస్తూ పట్టణ అభివృద్ధికి పాటు పడాల్సింది పోయి వర్గపోరు, స్వలాభమే లక్ష్యంగా కొత్తగూడెం మున్సిపాలిటీలో కొందరు పాలవర్గ సభ్యులు పని చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పాలకవర్గానికి తగ్గట్టుగా అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుండడం విస్మయం కలిగిస్తోంది.

కొనసాగుతున్న రామాయణ క్రతువు





శ్రీరామాయణ పారాయణం చేస్తున్న రుత్విక్‌లు (ఇన్‌సెట్) హోమం చేస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా యాగశాలలో శ్రీరామాయణ క్రతువు కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం స్వామివారి ఉత్సవ మూర్తులను మేళతాళాలు, రుత్విక్‌ల మంత్రోచ్ఛరణల నడుమ యాగశాలలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. 12 హోమ కుండాలలో శ్రీరామాయణ క్రతువు నిర్వహించారు. ఈ సందర్భంగా రుత్విక్‌లు చతుర్వేద హవనాలు, రామాయణ హవనం చేయగా, మరో వైపున రామషడాక్షరీ, నారాయణ అష్టాక్షరి మంత్రాలను జపించారు. అనంతరం సంక్షేప రామాయణ సామూహిక పారాయణం చేపట్టారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ గావించారు.

అగ్నిప్రమాదాల నివారణకు కార్యాచరణ

కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): షాపింగ్ మాళ్లు, సినిమా హాళ్లు తదితర వాటిలో అగ్నిప్రమాదాలు జరుగకుండా ఫైర్ ఆడిట్ నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి శుక్రవారం పలు అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అగ్నిమాపక, పంచాయతీ, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాల నివారణ, ఆడిట్ నిర్వహణపై సోమవారం నాటి సమావేశానికి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు రఘు, శ్రీకాంత్, అంకుషావలి, డీఆర్‌డీఓ అశోకచక్రవర్తి పాల్గొన్నారు.

మున్సిపల్ అంచనా బడ్జెట్ రూ.147.92 కోట్లు



బడ్జెట్ ప్రతులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, కమిషనర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో 2023 – 24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. మున్సిపాలిటీ అంచనా ఆదాయం రూ.147.92 కోట్లు, ఖర్చు రూ.147.08 కోట్లు, మిగులు ఆదాయం రూ.84.20 లక్షలుగా చూపిస్తూ అధికారులు బడ్జెట్ రూపొందించారు. దీన్ని కౌన్సిల్ సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపాలిటీ ఆదాయం నుంచి జీతాలు, పొరుగు సేవల ఉద్యోగుల వేతనాలు, పారిశుద్ధ్య నిర్వహణ, కరెంట్ బిల్లులు, రుణ వాయిదాల చెల్లింపులు, హరితహారానికి 10 శాతం నిధులు కేటాయించాలని నిర్ణయించారు. 1/3 వంతు నిధులను మున్సిపాలిటీలో విలీనమైన ప్రాంతాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, బలహీనవర్గాలు, మైనారిటీలు నివసించే ప్రాంతాలు, మురికి వాడల్లో మౌలిక వసతుల కల్పనకు కేటాయించారు. మిగిలిన నిధులను పార్కులు, వైకుంఠధామాల అభివృద్ధి, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, జంతు వధశాలల నిర్మాణం, శాస్త్రీయ పద్ధతిలో డంపింగ్ యార్డుల నిర్వహణ తదితర అవసరాలకు కేటాయిస్తామని మున్సిపల్ అధికారులు, కౌన్సిల్ సభ్యులకు వివరించగా సమష్టిగా చర్చించి ఆమోదించారు. మున్సిపాలిటీకి రూ.115 కోట్ల నిధులు వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, కమిషనర్ జి.రఘు, డీఈ నవీన్‌కుమార్, మేనేజర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

■ వార్షికోత్సవ సంబరం



'సాక్షి' దినపత్రిక 15వ వార్షికోత్సవ వేడుకలు ఖమ్మం యూనిట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు, ఉద్యోగులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. 'సాక్షి'లో ఇన్నేళ్లుగా తమ ప్రయాణాన్ని మననం చేసుకున్నారు.

ఏప్రిల్ 25 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

కొత్తగూడెం అర్బన్: తెలంగాణ ఓపెన్ స్కూల్ పరిధిలో పదో తరగతి, ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు ఏప్రిల్ 25నుంచి జరగనున్నాయని డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు. పదో తరగతి, ఇంటర్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 25నుంచి మే 4వ తేదీ వరకు, ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు మే 12నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్, మాజీ ఎంపీ పొంగులేటి



మాట్లాడుతున్న కోదండరామ్

చుంచుపల్లి: ఎన్నో ఆశలతో నిద్రాహారాలు మాని ఉద్యోగాల కోసం కష్టపడిన నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడిందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన సెమినార్‌లో వారు మాట్లాడారు. పేపర్ లీకేజీతో రాష్ట్రంలో ఎంతోమంది యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం తన తప్పేమీ లేదన్నట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. యువకులు నిరుత్సాహ పడకుండా పట్టుదలతో ముందుకు సాగుతూ లక్ష్యాలను సాధించాలని సూచించారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే వనమా తదితరులు

పాల్వంచ : మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగులో 25 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కేరళకు చెందిన తంత్రి ఎస్.ఎం.నంబూద్రి గురుస్వామి, జితేందర్, ఆలయ నిర్వాహకులు భట్టు వేణు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు హాజరు కాగా, ఆలయ కమిటీ వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్, మల్లెల శ్రీరామ్మూర్తి, పెద్దమ్మగుడి మాజీ చైర్మన్ మహిపతి రామలింగం, టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, నిర్వాహకులు భట్టు రెడ్యా నాయక్, భట్టు చందు, సురేశ్, జవహర్ లాల్, నరేశ్, సందీప్, పవన్, రాజు, సోమ్లా, తేజ పాల్గొన్నారు.

కౌలు కష్టానికి ఊరట



నేలవాలిన మొక్కజొన్న చేనులో వట్టికొండ రామకృష్ణ దంపతులు

సీఎం కేసీఆర్ భరోసా కల్పించారు..

నేను 35 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేస్తే ఇందులో 33 ఎకరాలు కౌలు భూమే. కౌలు, పెట్టుబడి కలిపి ఎకరాకు రూ.50 వేలు ఖర్చయింది. పంట చేతికందే సమయాన అకాల వర్షం దెబ్బతీసింది. సీఎం కేసీఆర్ నాతో మాట్లాడి ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని భరోసా కల్పించడం సంతోషంగా ఉంది.
– వట్టికొండ రామకృష్ణ, కౌలు రైతు, రావినూతల

అకాల వర్షాలతో నష్టపోయింది అధికంగా కౌలు రైతులే..

- సాయం అందిస్తామన్న సీఎం ప్రకటనతో ఆశలు
- గణాంకాలపై అధికారుల కసరత్తు
- మార్గదర్శకాలు విడుదలైతే త్వరలోనే సాయం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అకాల వర్షం కౌలు రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. దెబ్బతిన్న పంటను చూసి కౌలు రైతు తీవ్ర నిరాశకు గురైన వేళ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన వారికి ఊరట కలిగించింది. ఇటీవల వర్షాలు, గాలిదుమారానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 21,250 మంది రైతులకు చెందిన 34,208 ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గురువారం ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కౌలు రైతులను కూడా ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో గతంలో ఎన్నడూ సాయం పొందని వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఎకరానికి రూ.10వేల చొప్పున పరిహారానికి సంబంధించి జీఓ జారీ కావడంతో జిల్లాలో కౌలు రైతుల లెక్కలను తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

కౌలు రైతులకు అండగా..

ఈనెల 17 నుంచి 21 మధ్య కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల్లో అత్యధికం కౌలు రైతులు సాగు చేసినవే ఉన్నాయి. ఆయా రైతులు ఇప్పటికే కౌలు చెల్లించడమే కాక పెట్టుబడికి రూ.లక్షల్లో వెచ్చించడంతో అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలో గురువారం జిల్లాలో పంటలను పరిశీలించిన సీఎం కేసీఆర్ కౌలు రైతులకూ సాయం చేస్తామని ప్రకటించారు. కొందరు కౌలు పూర్తిగా చెల్లించామని, మరికొందరు సగమే చెల్లించామని సీఎం దృష్టికి తీసుకురాగా.. పంట సాగు చేసి నష్టపోయిన వారందరికీ సాయం అందేలా చర్యలు తీసుకుంటామని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 19,732 మంది రైతులు నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేయగా.. ఇందులో 60 శాతం మంది కౌలు రైతులే ఉంటారని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు.

తెలంగాణ రాకముందు అర్హత కార్డులు

ఉమ్మడి జిల్లాలో నష్టపోయిన కౌలు రైతులను గుర్తించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఖమ్మం జిల్లాలో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురావడంతో వారిని గుర్తించేలా కలెక్టర్‌ను ఆదేశాలు ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఈమేరకు కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ సాగుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.10 వేలు చొప్పున సాయం అందించేందుకు ఇప్పటికే జీఓ జారీ కాగా, మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉంది. అలాగే కౌలు రైతులను కూడా గుర్తించాల్సి ఉండడంతో ఆయా అంశాలపై సీఎస్ శుక్రవారం కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో వీసీ ద్వారా సమీక్షించారు. తెలంగాణ ఏర్పడకముందు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దాదాపు లక్ష మంది కౌలు రైతులు ఉన్నట్లు గుర్తించి వారికి పంట రుణాల నిమిత్తం అర్హత కార్డులు జారీ చేశారు. అయితే ప్రస్తుతం కౌలు రైతులు ఎందరు ఉంటారనే గణాంకాలు తేల్చడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇక గతంలో పంట నష్టపరిహారం జరిగినప్పుడు వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా ఇచ్చే నివేదిక ఆధారంగా 33 శాతం పంట దెబ్బతింటేనే సాయం అందించేవారు. అయితే ఈసారి ఏ ప్రాతిపదిక సాయం చేస్తారో తేలాల్సి ఉంది.

అ'కాలం' మింగేసింది..

యాసంగిలో సాగు చేసిన కొన్ని పంటలు వర్షార్పణమయ్యాయి. మిగిలిన పంటల పరిస్థితి ఎలా ఉన్నా.. మొక్కజొన్న పంటపై వర్ష ప్రభావం తీవ్రంగా ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 20,890 మంది రైతులకు చెందిన 33,357 ఎకరాల్లో మొక్కజొన్న పూర్తిగా నేలవాలి పనికి రాకుండా పోయింది. ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో పెసర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరి పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా ఖమ్మం జిల్లాలోని బోనకల్, చింతకాని, కొణిజర్ల, వైరా తదితర మండలాల్లో అకాల వర్షాలతో మొక్కజొన్న పంట తుడిచిపెట్టుకుపోయింది.

ఉమ్మడి జిల్లాలో రైతుల వివరాలు

జిల్లా	పాస్‌పుస్తకం ఉన్న రైతులు	కౌలు రైతులు (అంచనా)
ఖమ్మం	3,13,628	1,60,000
భద్రాద్రి కొత్తగూడెం	1,46,000	60,000

క్లుప్తంగా

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

హాజరైన ఎమ్మెల్యే వనమా, మాజీ ఎంపీ పొంగులేటి



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామస్వామి దేవాలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు జరిపారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఎంపీపీ మడవి సరస్వతి, సర్పంచ్ బాదావత్ శాంతి, పెద్దమ్మ గుడి మాజీ చైర్మన్ మహిపతి రామలింగం, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు మల్లేల శ్రీరాంమూర్తి, మంతపురి రాజ్‌గౌడ్‌లతో పాటు మడవి ఈశ్వర్, శ్రీను, కొప్పారపు మధు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న భానుమతి

కొత్తగూడెంటౌన్: అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వ పథకాలతో లబ్ధి చేకూరాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి అన్నారు. పెనగడపలో శుక్రవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పేదలకు మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం తదితర అంశాల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పేదలకు ఉచిత న్యాయ సేవలు అందించడంతో పాటు కేసును ఉచితంగా పరిష్కరించేందుకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంను జిల్లా కోర్టులో ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తమరావు, డిప్యూటీ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, అసిస్టెంట్ కౌన్సిల్ జ్యోతి విశ్వకర్మ, నాగస్రవంతి, చుంచుపల్లి తహసీల్దార్ కృష్ణప్రసాద్, సర్పంచ్ వెంకటమ్మ, టూటౌన్ ఎస్సై జుబేదా, ఎంపీటీసీ నాగమణి, పారా లీగల్ వాలంటీర్ రాజమణి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ..

'ఉపాధి' టెక్నికల్ అసిస్టెంట్‌కు గాయాలు

పినపాక: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌కు గాయాలైన ఘటన మండల పరిధిలోని సీతారాంపురం గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా మణుగూరు నుంచి పినపాకకు ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ ఉపేందర్ ఆఫీస్‌కు వస్తున్న క్రమంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో ఉపేందర్‌కు గాయాలు కాగా స్థానికులు ప్రైవేట్ వాహనంలో మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి..

కరకగూడెం: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కౌలూరు గ్రామానికి చెందిన మలకం రాంబాబు శుక్రవారం కలవల నాగారంలోని జాతరకు వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో భట్టుపల్లి సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో స్థానికులు 108లో కరకగూడెం పీహెచ్‌సీ ఆపై భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రెండు బైకులు ఢీకొని దంపతులకు..

కుర్నవల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పోలెబోయిన తిరుపతయ్య, అతడి భార్య సర్పంచ్ శ్రీవాణి దంపతులు శుక్రవారం బైక్‌పై మర్కోడు వెళ్తున్న క్రమంలో రేగళ్లగ్రామం సమీపంలో ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతులిద్దరికి గాయాలు కావడంతో మణుగూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బాలుడిపై కుక్కల దాడి..

అశ్వారావుపేటరూరల్: ఓ బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని వినాయకపురం కాలనీ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొండపల్లి మానీష్ అనే ఎనిమిదేళ్ల బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటుండగా.. అకస్మాత్తుగా మూడు కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. గమనించిన స్థానికులు కుక్కల బారి నుంచి బాలుడిని రక్షించగా.. అప్పటికే నడుముపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబీకులు స్థానికంగా ప్రథమ చికిత్స చేయించి, జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు. కాగా, గ్రామంలో కొద్ది రోజులుగా అంగన్‌వాడీ సెంటర్లకు వెళ్లే చిన్నారులపై దాడి చేస్తున్నాయని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

పల్లెల్లో అవార్డుల సందడి

- పంచాయతీల పనితీరుకు ప్రశంసలు
- జాతీయ పురస్కారానికి 27 జీపీలు
- నేడు ఐడీఓసీలో సర్పంచ్‌లకు సన్మానం



చుంచుపల్లి మండలం రామాంజనేయకాలనీ సర్పంచ్‌ను సన్మానిస్తున్న అధికారులు

చుంచుపల్లి: పల్లెపాలనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీలను జిల్లా కమిటీ జాతీయ పురస్కారాలకు ఎంపిక చేసింది. మండల స్థాయిలో ఇప్పటికే ఉత్తమంగా నిలిచిన గ్రామాలకు అధికారులు అవార్డులు, ప్రశంస పత్రాలను అందజేస్తున్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ఏప్రిల్ 24న ఉత్తమ పంచాయతీలకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తోంది. ఇందుకోసం గతేడాది అక్టోబర్‌లో ప్రభుత్వం గ్రామపంచాయతీల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా జీపీలు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్నాయి.

తొమ్మిది విభాగాల్లో ప్రగతిపై..

పల్లెల్లో జీవనోపాధి, ఆరోగ్యం, తాగునీరు, స్వయం సమృద్ధి, గ్రామ సభల నిర్వహణ, పచ్చదనం పరిశుభ్రత, మహిళల సమస్యల పరిష్కారం, బడిబాట, సామాజిక భద్రత వంటి తొమ్మిది విభాగాల ఆధారంగా దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో ఉత్తమ స్కోరు సాధించిన పంచాయతీలను మండలానికి 27 పంచాయతీల చొప్పున తొలుత ఎంపిక చేశారు. మండల స్థాయిలో ఉత్తమంగా నిలిచిన పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులను మండల ప్రత్యేక అధికారి సమక్షంలో శుక్రవారం సన్మానించి ప్రశంస పత్రాలు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కువ పంచాయతీలకు అవార్డులు ఇవ్వడంతో పల్లెల్లో సందడి వాతావరణం కనిపించింది. ఇక 27 గ్రామ పంచాయతీలను జాతీయ పురస్కారాలకు జిల్లా కమిటీ ఎంపిక చేసింది. జాతీయస్థాయిలో ఉత్తమంగా ఎంపికైన పంచాయతీలకు రూ.లక్ష నుంచి రూ.5 కోట్ల వరకు ఇవ్వనున్నారు. ఈ 27 పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులను శనివారం ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టర్ అనుదీప్, డీపీఓ అధికారి రమాకాంత్ ఆధ్వర్యంలో సన్మానించనున్నారు.

ఎంపికైన ఉత్తమ పల్లెలు..

జిల్లా వ్యాప్తంగా 481 గ్రామపంచాయతీలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు 2022 – 23 జాతీయ పురస్కారాల కోసం జిల్లాలోని పలు గ్రామపంచాయతీలు దరఖాస్తు చేసుకున్నాయి. కేంద్రం సూచించిన 9 విభాగాల్లో ఉత్తమంగా నిలిచిన గ్రామాలను ప్రతి మండలంలో 27 చొప్పున ఎంపిక చేశారు. ఇలా జిల్లాలో 567 పంచాయతీలు(ఒక్కో జీపీ రెండు, మూడు విభాగాల్లోనూ ఎంపికయ్యాయి) ఎక్కువ మార్కులు సాధించాయి. ఈ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లకు అధికారులు ప్రశంస పత్రాలు అందజేశారు.

ఎంపికైన పంచాయతీలివే..

దమ్మపేట మండలంలో జమేదారు బంజర (రెండు విభాగాల్లో), సుజాతనగర్ (మూడు విభాగాల్లో), బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర (రెండు), చుంచుపల్లి మండలం గౌతమ్‌పూర్ (రెండు), జూలూరుపాడు మండలం కాకర్ల, టేకులపల్లి మండలం బోడు, బూర్గంపాడు మండలం ఉప్పుసాక (రెండు), దమ్మపేట మండలం తొట్టి పంపు, అకినేపల్లి(మూ డు), బూర్గంపాడు మండలం కోయగూడెం, చుంచుపల్లి మండలం అంబేద్కర్ నగర్ కాలనీ (రెండు), ఇల్లెందు మండలం చల్లసముద్రం(రెండు), అశ్వారావుపేట, భద్రాచలం, సుజాతనగర్ మండలం వేపలగడ్డ, టేకులపల్లి మండలం చింతోనిచలక, దుమ్ముగూడెం మండలం చింతగుప్ప పంచాయతీలు ఉన్నాయి.

క్షయ నిర్మూలనలో జిల్లాకు జాతీయస్థాయి అవార్డు

చుంచుపల్లి: క్షయ వ్యాధి నిర్మూలనలో జిల్లాకు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు దక్కింది. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో శనివారం ప్రకటించిన అవార్డుల్లో జిల్లాకు వెండి పతకం లభించింది. మొదటి స్థానంలో నిజామాబాద్‌కు బంగారు పతకం లభించగా.. ఆ తర్వాత స్థానాల్లో నిలిచిన భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ జిల్లాలకు వెండి పతకాలు దక్కాయి. గడిచిన రెండేళ్లలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణ కోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తూ కేసులను తగ్గిస్తూ వస్తున్నారు. ఈక్రమంలోనే 2015 కేసులతో పోలిస్తే..జిల్లాలో క్షయ వ్యాధి నివారణ తగ్గింపు లక్ష్యం 80 శాతం ఉండగా 40 శాతం కేసులు తగ్గించి రాష్ట్రంలో రెండో స్థానం దక్కించుకుంది. ఈమేరకు జిల్లా క్షయ విభాగం అధికారులు, సిబ్బందిని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి అభినందించారు. జిల్లాలో గతేడాది 2,138 కేసులు నమోదు కాగా, జనవరి నుంచి ఇప్పటి వరకు 450 క్షయ వ్యాధి పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గడిచిన రెండేళ్లు కూడా జాతీయస్థాయిలో జిల్లాకు వరుసగా కాంస్య పతకాలు దక్కాయి.

జీపీలు మరింత పురోగతి సాధించాలి



సర్పంచ్, కార్యదర్శులను సన్మానిస్తున్న డిప్యూటీ సీఈఓ, తదితరులు

బూర్గంపాడు: గ్రామ పంచాయతీలు మరింత పురోగతి సాధించేలా పాలకవర్గాలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ నాగమణి అన్నారు. మోరంపల్లిబంజర రైతు వేదికలో శుక్రవారం జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సర్పంచ్‌లకు, కార్యదర్శులకు సన్మానం చేసి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీపీల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. బూర్గంపాడు మండలంలోని మోరంపల్లిబంజర, బూర్గంపాడు, నాగినేనిప్రోలు, సారపాక, టేకుల చెరువు, ఉప్పుసాక, ముసలిమడుగు, వేపలగడ్డ, కృష్ణసాగర్, కోయగూడెం, పినపాక పట్టీనగర్ జీపీలు జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, డీఎల్‌పీఓ పవన్‌కుమార్, ఎంపీడీఓ వివేక్ రామ్, ఎంపీఓ సునీల్‌కుమార్, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఐటీసీ అనుబంధ వాష్ సంస్థ ప్రతినిధులు కృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



విజయ సంకేతం చూపిస్తున్న నూతన అసోసియేషన్ సభ్యులు

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేష్‌కుమార్ మక్కడ్, జాయింట్ సెక్రటరీగా కాసాని రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలక్షన్ చీఫ్ ఆఫీసర్‌గా పలివేల సాంబశివరావు, ఆఫీసర్లుగా మెండు రాజమల్లు, జీకే అన్నపూర్ణ, పాల రాజశేఖర్‌లు వ్యవహరించారు. బార్ అసోసియేషన్ ఎన్నికైన సభ్యులు స్వీట్లు పంచి, రంగులు చల్లుకొని సంబరాలు జరుపుకున్నారు.

ఎన్నికల్లో విజేతలు వీరే ..

కొత్తగూడెం బార్ అసోసియేషన్‌లో మిగిలిన పదవుల కోసం పోటీ పడగా.. ఉపాధ్యక్షుడిగా గడిపెల్లి మహేష్, ప్రధాన కార్యదర్శిగా రావిలాల రామారావు, కోశాధికారిగా సంతోష్‌లాల్ సాహూ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పిట్టల రామారావు, లైబ్రరీ సెక్రటరీగా యాస యుగందర్, మహిళా రిప్రజంటేటివ్‌గా అత్తలూరి మనోరమ గెలుపొందారు. మొత్తం 214 ఓట్లల్లో 202 ఓట్లు పోలైనట్లు ఎలక్షన్ ఆఫీసర్లు తెలిపి గెలుపొందిన వారికి న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

సత్తుపల్లి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సతీష్

అశ్వారావుపేటరూరల్: సత్తుపల్లిలో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సత్తుపల్లి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా అశ్వారావుపేటకు చెందిన న్యాయవాది మారం సతీష్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు తోటి న్యాయవాదులు, అధికారులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

సెల్‌టవర్ ఎక్కి మందుబాబు హల్‌చల్



సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేస్తున్న మందుబాబు

చర్ల: మండలంలోని కలివేరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఓ వ్యక్తి మద్యం సేవించి గ్రామంలో ఉన్న సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాబూరావు శుక్రవారం శుక్రవారం సాయంత్రం అతిగా మద్యం సేవించి తాగినమైకంలో గ్రామంలో ఉన్న సెల్ టవర్ ఎక్కి కొద్దిసేపు హల్‌చల్ చేశాడు. దీంతో స్థానికులు అక్కడకు చేరుకొని కిందకు దిగి రావాలని సూచించడంతో దిగి వచ్చాడు. గతంలోనూ తాగిన మైకంలో ఒకసారి సెల్ టవర్ ఎక్కాడని, ప్రధాన రహదారిపై అడ్డంగా పడుకొని వచ్చిపోయే వాహనాలను ఆపుతుంటాడని స్థానికులు తెలిపారు. ఇతడి ప్రవర్తనకు ఆయన భార్య విడిచి వెళ్లిపోగా.. ఇద్దరు పిల్లలను పెట్టుకొని జీవిస్తున్నాడని, తాగిన సందర్భాల్లో మతిస్థిమితంగా ఉండడం లేదని స్థానికులు చెబుతున్నారు.

నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించాలి



మాట్లాడుతున్న బ్రాంచ్ మేనేజర్ లక్ష్మోజీ

పాల్వంచరూరల్: ఈ ఏడు అటవీ ఉత్పత్తుల ఫల సహాయ సేకరణ లక్ష్యాన్ని అధికమించాలని జీసీసీ పాల్వంచ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మోజీ కోరారు. స్థానిక గిరిజన సహకార సంస్థ బ్రాంచ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సొసైటీ పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం గతేడాది బ్రాంచ్ పరిధిలో వచ్చిన ఆదాయ, వ్యయాలపై సమీక్షించారు. ఈ ఏడాది బ్రాంచ్ పరిధిలో నిర్దేశించిన రూ.25కోట్ల అటవీ ఉత్పత్తుల ఫలసహాయ సేకరణ లక్ష్యాన్ని అధికమించాల్సిన అవసరం ఉందన్నారు. బ్రాంచ్ కార్యాలయ సమూదాయంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని, డీఆర్‌డీపోలు కొన్ని శిథిలావస్థకు చేరిన దృష్ట్యా పక్కా భవనాల మంజూరు చేయాలని సమావేశంతో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ తేజావత్ హర్యలతో పాటు నాలుగు గ్రామాల సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

కేన్సర్‌తో యువకుడు..



రాహుల్(ఫైల్)

టేకులపల్లి: బ్లడ్ కేన్సర్‌తో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకులపల్లి మండలం సులానగర్ గ్రామానికి చెందిన కర్లపూడి రాహుల్(24) కారేపల్లి కాలేజీలో డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మూడేళ్ల క్రితం అనారోగ్యం కారణంగా పరీక్షలు చేయించగా.. బ్లడ్ కేన్సర్ అని తేలింది. దీంతో చికిత్స కోసం రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రులకు తిరిగి అప్పుచేసి సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ సీఎంఆర్ఎఫ్ కింద రూ.3లక్షల చొప్పున రెండు సార్లు రూ.6 లక్షలు అందజేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. కొత్తగూడెంలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియలకు రాహుల్ స్నేహితులు హాజరై భారీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి వారి స్నేహపు మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం అందరినీ కలిచి వేసింది. రాహుల్ మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే హరిప్రియ హైదరాబాద్ నుంచి బాధిత కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా ఓదార్చారు. మృతుడుకి సోదరి, తల్లిదండ్రులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

ములకలపల్లి : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండలపరిధిలోని సుబ్బనపల్లి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అనందపురం గ్రామానికి చెందిన సోయం నాగరత్నం (35) తమ బంధువుతో కలిసి ద్విచక్ర వాహనంపై ములకలపల్లి వెళ్లి, తిరిగి ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో సుబ్బనపల్లి శివారులో ప్రమాదవశాత్తు బైక్ పైనుంచి కిందపడి తీవ్రగాయాలయ్యాయి. పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. కాగా, నాగరత్నం కిందపడినప్పుడు పాల్వంచ వైపు వెళ్తున్న లారీ ఆమెను ఢీకొట్టిందని, దానివల్లే తీవ్రగాయాలై మృతిచెందిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో లారీ, డ్రైవర్‌ను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి..



నరసింహారావు (ఫైల్)

సుజాతనగర్: సుజాతనగర్‌కు చెందిన ధరంసోత్ నర్సింహారావు(32) స్థానిక డబుల్ బెడ్ రూం ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం సుజాతనగర్ నుంచి రాఘవాపురం రోడ్డులోని డబుల్ బెడ్‌రూం ఇంటి వైపు నడుచుకుంటూ వెళ్తుండగా.. చంద్రుగొండ మండలం పోకలగూడెం గ్రామానికి చెందిన తేజావత్ రాంచందర్, బానోత్ దావీద్ అనే ఇద్దరు యువకులు సర్వారం నుంచి పోకలగూడెం వైపు ద్విచక్రవాహనంపై వస్తూ.. ప్రమాదవశాత్తు వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో తీవ్రగాయాలైన నర్సింహారావు 108లో కొత్తగూడెం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడుకి భార్య దేవి, కూతురు, కుమారుడు ఉన్నారు. కూలీ పనులు చేసుకొని జీవిస్తున్న వీరికి గత రెండేళ్ల క్రితం డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరైంది. వాహనం నడుపుతున్న రాంచందర్‌తో పాటు దావీద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

బాలికకు రూ.5లక్షల పరిహారం కూడా చెల్లించాలని తీర్పు

కొత్తగూడెంటౌన్: ఏడేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై నమోదైన పోక్సో కేసులో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి (పోక్సో స్పెషల్ జడ్జి) ఎం.శ్యాంశ్రీ తీర్పు చెప్పారు. ఈమేరకు శుక్రవారం వెలువడిన ఈ తీర్పు వివరాలు... దమ్మపేట మండలం ముష్టిబండకు చెందిన మైనర్ బాలిక 2019 జనవరి 3న పక్కింటికి వెళ్లింది. ఎంతసేపటికి బాలిక రాకపోవడంతో ఆమె తల్లికి అనుమానం వచ్చి వెళ్లగా ఆ ఇంటి యజమాని కొలికిపోగు ప్రసాద్ ఇంట్లో నుండి కంగారుగా బయటకు పరుగెత్తాడు. దీంతో బాలికను వివరాలు ఆరా తీయగా అత్యాచారయత్నం చేసినట్లు చెప్పడంతో దమ్మపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి డీఎస్పీ జి.మధుసూదన్‌రావు నేతృత్వాన విచారణ చేపట్టి చార్జీషీట్ దాఖలు చేయగా, విచారణ అనంతరం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే, బాలికకు రూ.5లక్షల పరిహారాన్ని నిందితుడు చెల్లించాలని ఆదేశించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ పీ.వీ.డీ.లక్ష్మి వాదించగా, కేసు విచారణకు ఏఎస్సై షేక్ సర్దార్, కానిస్టేబుళ్లు హరిగోపాల్, మొహమ్మద్ ఫరూకి మున్నా సహకరించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

పినపాక: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు చెట్టు కు ఉరేసుకొని మృతి చెందిన ఘటన మండలంలోని భూ పాలపట్నం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పో లీసులు తెలిపిన వివరాలు ప్ర కారం.. గ్రామానికి చెందిన వాగబోయిన వినోద్ (28) సమీప భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ సె క్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి గ్రామశివారులోని చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. అటుగా వెళ్తున్న గ్రా మస్తులు గమనించి కుటుంబసభ్యులకు, పోలీ సులకు సమాచారం అందించగా.. పోలీ సులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడుకి భార్య అరుణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి రామచందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ దిలీప్ తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక వివాహిత..

తల్లాడ: మండలంలోని నారాయణపురానికి చెందిన వివాహిత భర్త వేధింపులు తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పాట్టేటి శ్రావ్య (22)కు ఖమ్మంకు చెందిన పవన్ కృష్ణారెడ్డితో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరు కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లో ఉంటూ కెనరా బీఎంగా కృష్ణారెడ్డి విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే, భర్త వేధింపులు తాళలేక శ్రావ్య ఆరు నెలల క్రితం నారాయణపురం వచ్చి పుట్టింట్లో ఉంటుంది. విడాకుల కోసం ఇద్దరూ కోర్టును ఆశ్రయించగా, కృష్ణారెడ్డిపై తల్లాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అయినప్పటికీ వేధింపులు ఆగకపోవడంతో ఆమె మనస్తాపం చెంది ఇంట్లో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వైరా ఏసీపీ రెహమాన్, ఎస్‌ఐ సురేష్ పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

భార్య కాపురానికి రావడంలేదని వ్యక్తి..

ఇల్లెందు: భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపంతో భర్త ఉరివేసుకొని మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని 21 ఫిట్ ఏరియాకు చెందిన ఈర్ల రమేష్(48) గత కొంతకాలంగా మద్యానికి బానిసై భార్యను వేధిస్తుండేవాడు. విసుగు చెందిన ఆమె పుట్టింటికి వెళ్లి కాపురానికి రావడంలేదు. దీంతో మనస్తాపం చెందిన రమేష్ మద్యం మత్తులో శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేయి కోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పాల్వంచ: కుటుంబ సమస్యల నేపథ్యాన ఓ వ్యక్తి చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. వర్మ అనే వ్యక్తి శుక్రవారం బార్ షాప్ ఎదుట తన చేయిని కోసుకుని చనిపోతానంటు కొంతసేపు హల్‌చల్ చేశాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించి వర్మను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్సకు సైతం సిబ్బందికి సహకరించకుండా వెళ్లిపోయాడు. మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు ఏమి రాలేదన్నారు.

అది దొంగల రాజ్యం...

ఆధారాలతో చంద్రబాబు మరో భారీ దోపిడీ బట్టబయలు
శాసనసభలో సీఎం వైఎస్‌ జగన్‌ వెల్లడి

సాక్షి, అమరావతి : 'అమరావతిలో సచివాలయం, శాసనసభ, న్యాయస్థానం భవన నిర్మాణాల్లో చంద్రబాబు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారు. కాంట్రాక్టు సంస్థలను బెదిరించి మరీ భారీ వసూళ్లు చేశారు. తన మనుషుల ద్వారా బోగస్‌ కంపెనీలు సృష్టించి సబ్‌ కాంట్రాక్టుల రూపంలో నిధులు కొల్లగొట్టారు' అని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'ఇది మనం చెబుతోంది కాదు. ఆదాయ పన్ను శాఖ అధికారుల సోదాల్లో బట్టబయలైన అవినీతి బాగోతం. ఐటీ శాఖ అప్రైజల్‌ రిపోర్ట్‌ వెల్లడించిన వాస్తవం' అని వెల్లడించారు. 'అమరావతిలో భవన నిర్మాణ కాంట్రాక్టు కంపెనీలపై ఐటీ అధికారులు దాడులు నిర్వహిస్తే ఈ అవినీతి బండారం బయట పడింది. అందుకే చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది' అని తెలిపారు. అమరావతి నిర్మాణాల విషయంలో చంద్రబాబు అవినీతిపై ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిన అంశంపై శాసనసభలో శుక్రవారం నిర్వహించిన చర్చలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. 'చంద్రబాబు తమను బెదిరించడంతోనే ఆయన చెప్పిన బోగస్‌ కంపెనీలకు నిధులు మళ్లించామని షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధులు ఐటీ శాఖకు ఇచ్చిన వాంగ్మూలంలో అంగీకరించారు. మరో నిర్మాణ సంస్థ ఎల్‌ అండ్‌ టీ కంపెనీ నుంచి తామే నిధులు వసూలు చేసి, చంద్రబాబుకు అందించామని వెల్లడించార'ని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంలో చంద్రబాబు నిధులను కొల్లగొట్టిన తీరును ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ ఇలా వివరించారు.


GOVERNMENT OF INDIA
MINISTRY OF FINANCE
INCOME TAX DEPARTMENT

చంద్రబాబుకు ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులు

● ఐటీ దాడులతో వెలుగులోకి..

- మొట్టమొదటగా ఆదాయ పన్ను శాఖ (ఐటీ శాఖ) అధికారులు షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్‌ వాసుదేవ్‌ నివాసంలో 2019 నవంబర్‌లో సోదాలు నిర్వహించారు. అక్కడ మొత్తం సమాచారం లభించింది. ఆ తర్వాత 2020 ఫిబ్రవరిలో చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌ నివాసంలో సోదాలు చేశారు. దాంతో మరింత సమాచారం లభించింది.
- ఆదాయ పన్ను శాఖ పరిశోధన విభాగం ఆ మొత్తం సమాచారాన్ని క్రోడీకరించి ఆదాయ పన్ను అప్రైజల్‌ రిపోర్ట్‌ను తయారు చేసింది. తాము నిర్వహించిన దాడుల్లో లభించిన ఆధారాల ప్రకారం సంబంధిత వ్యక్తులను పిలిపించారు. తాము సేకరించిన ఆధారాలను ఆ వ్యక్తులకు చూపించి వారి వాంగ్మూలాలు నమోదు చేశారు. ఆ వాంగ్మూలాలపై వారు సంతకాలు కూడా పెట్టారు. వాటన్నింటి ఆధారంగా ఐటీ అధికారులు చంద్రబాబుకు ఇప్పుడు నోటీసులు పంపారు.

● చంద్రబాబు అవినీతి బాగోతం ఇలా..

- అమరావతిలో నిర్మాణాల కంట్రాక్టుల్లో చంద్రబాబు భారీగా అవినీతికి పాల్పడ్డారు. అందుకోసం పక్కాగా స్కెచ్‌ వేశారు. 2019 జనవరి, ఫిబ్రవరిలో చంద్రబాబు షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్‌ వాసుదేవ్‌ను పిలిపించుకుని తన పీఏ శ్రీనివాస్‌ను కలవమని చెప్పారు. దాంతో మనోజ్‌.. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌ను కలిశారు.
- షాపూర్జీ పల్లోంజీ కంపెనీ కర్నూలు, గుంటూరు, అనంతపురం, పశ్చిమగోదారిల్లో టిడ్కో ఇళ్లు, అమరావతిలో హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం తాత్కాలిక భవనాల నిర్మాణంతో పాటు రాజధానిలో ఇతర నిర్మాణ పనులను కలిపి 2018 నాటికి రూ.8 వేల కోట్ల విలువ చేసే కాంట్రాక్ట్‌ పనులు చేసింది. అందులో తన కమీషన్లు వసూలు చేసేందుకు బాబు.. శ్రీనివాస్‌ను రంగంలోకి దింపారు. వినయ్‌ నంగల్లా, విక్కీ జైన్‌ అనే ఇద్దరిని మనోజ్‌కు శ్రీనివాస్‌ అటాచ్‌ చేశారు. వీరిలో వినయ్‌ నంగల్లా మూడు కంపెనీలు, విక్కీ జైన్‌ రెండు కంపెనీలు సృష్టించారు. ఆ కంపెనీలకు బోగస్‌ సబ్‌ కాంట్రాక్టుల కింద డబ్బులు ఇవ్వమన్నారు. వాళ్ల నుంచి తాము డబ్బులు తీసుకుంటామని చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌ మనోజ్‌తో చెప్పారు.
- దాంతో వినయ్‌ నంగల్లా హయగ్రీవమ్, అన్నై షలాఖా అనే కంపెనీలను మనోజ్‌కు అటాచ్‌ చేశారు. విక్కీ జైన్‌.. నయోలిన్, ఎవరెట్‌ అనే రెండు కంపెనీలను అటాచ్‌ చేశారు. మనోజ్‌కు వాళ్లెవరో కూడా తెలియదు. తాము ఇలా డబ్బులు ఇవ్వలేమని, కావాలంటే పార్టీకి ఫండ్‌ ఇస్తామని షాపూర్జీ పల్లోంజీ కంపెనీ చెప్పింది. తాము చెప్పినట్లు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని మనోజ్‌ను శ్రీనివాస్‌ బెదిరించారు. ఆ విషయాన్ని మనోజ్‌ ఐటీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో కూడా వెల్లడించారు. ఆ వాంగ్మూలం కాపీలు కూడా ఉన్నాయి.
- ఆ కంపెనీలకు బోగస్‌ సబ్‌ కాంట్రాక్టుల కింద డబ్బులు ఇచ్చిన తర్వాత వాటిని వసూలు చేసి చంద్రబాబుకు అప్పగించే బాధ్యతను ఆర్వీఆర్‌ రఘు, కృష్ణ, నారాయణ్, శ్రీకాంత్, అనికేత్‌ బలోటాలకు అప్పగించారు. ఇదీ ఈ మోడస్‌ ఆఫ్‌ ఆపరెండీ. ఐటీ అధికారులు ఈ సమాచారాన్ని అంతా ఆ కంపెనీల ప్రతినిధుల నుంచి వాంగ్మూలంగా తీసుకుని ఐటీ అప్రైజల్‌ రిపోర్ట్‌ తయారు చేశారు. దాన్ని చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌కు చూపించారు. అదంతా వాస్తవమేనని శ్రీనివాస్‌ అంగీకరించి సంతకాలు కూడా చేశారు.
- శ్రీనివాస్‌తోపాటు రఘు, మిగిలిన వారిని కూడా ఐటీ అధికారులు ప్రశ్నించారు. వాళ్లు కూడా అదంతా వాస్తవమేనని అంగీకరించి సంతకాలు కూడా చేశారని ఐటీ అప్రైజల్‌ రిపోర్ట్‌ వెల్లడిస్తోంది.
- చంద్రబాబుకు దుబాయిలో కూడా రూ.15.14 కోట్లను దినార్ల రూపంలో క్యాష్‌గా ఇచ్చినట్టు ఐటీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో మనోజ్‌ అంగీకరించారు. దాంతోనే ఐటీ అధికారులు చంద్రబాబుకు నోటీసులు ఇచ్చారు. స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ కుంభకోణంలో కూడా చంద్రబాబుకు ఇలానే మూడు నెలల్లో రూ.371 కోట్లు అందాయి. ఆ కుంభకోణంలో చంద్రబాబుకు డబ్బులు చేర్చిన యోగేశ్‌ గుప్తానే ఈ వ్యవహారంలో కూడా ఉన్నారు.

● ఇది రూ.2 వేల కోట్ల దోపిడీ


- ఐటీ అధికారులు విశాఖపట్నం, విజయవాడ, కడప, ఢిల్లీ, పూణేల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌తోపాటు మరికొందరిపై జరిపిన దాడుల్లో లెక్కల్లో చూపని రూ.రెండు వేల కోట్లు దొరికినట్టు సెంట్రల్‌ బోర్డ్‌ ఆఫ్‌ డైరెక్ట్‌ ట్యాక్సెస్‌ 2020 ఫిబ్రవరి 13న ఒక ప్రకటనలో వెల్లడించింది. 40 చోట్ల జరిపిన తనిఖీల్లో బోగస్‌ సబ్‌ కాంట్రాక్ట్‌ కంపెనీలు, ఇన్వాయిస్లు, బిల్లులు ఇతర ఆధారాలు లభించాయని చెప్పింది.
- రెండో దశ దర్యాప్తులో భాగంగా ఐటీ అధికారులు 2022 సెప్టెంబర్‌ 28న చంద్రబాబుకు నోటీస్‌ ఇచ్చారు. ఈ కేసును డీసీఏసీ–సెంట్రల్‌ సర్కిల్‌కు బదిలీ చేస్తున్నామని తెలిపారు. ఈ కేసులో త్వరలో చంద్రబాబును కూడా విచారణకు పిలవనున్నారు.
- 2019లో అర్జంటుగా డబ్బులు ఇవ్వాలని మనోజ్‌ వాసుదేవ్‌కు చంద్రబాబు చెప్పారు. హయగ్రీవా, అన్నై షలాఖా అనే సంస్థలకు రూ.52.50 కోట్లు.. నవోలిన్, ఎవరెట్‌ కంపెనీలకు రూ.62.90 కోట్లు చొప్పున మనోజ్‌ చెల్లించారు. చంద్రబాబు ఆదేశాలతో మనోజ్‌.. ఎల్‌ అండ్‌ టీ కంపెనీ నుంచి కూడా డబ్బులు వసూలు చేసి ఇప్పించారు. ఎల్‌ అండ్‌ టీ కంపెనీ ప్రతినిధులు అతుల్‌ సోని, బాల వెంకటేశ్‌ ఫినిక్స్‌ ఇన్‌ఫ్రా, ఫోర్‌ ట్రేడింగ్, లక్‌ స్టోన్‌ అండ్‌ కో బోగస్‌ కంపెనీల ఖాతాల్లో రూ.41.90 కోట్లు జమ చేశారు. మొత్తం రూ.157.3 కోట్లు మళ్లించారు.
- ఈనాడు రామోజీరావు కుమారుడు కిరణ్‌ వియ్యంకుడు ఆర్వీఆర్‌ రఘుతోపాటు కృష్ణ, నారాయణ, శ్రీకాంత్, అనికెత్‌ బల్డోటాలకు ఈ రూ.157.3 కోట్లు చేరాయి. వారు ఆ నిధులను నేరుగా చంద్రబాబుకు చేర్చారు. ఈ వ్యవహారంలో నారా లోకేశ్‌ పీఏ రాజేశ్‌ కిలారి కీలక పాత్ర పోషించారు.

● కోట్ల మళ్లింపునకు కోడ్‌ భాష

- ఆర్వీఆర్‌ రఘు వాట్సాప్‌ చాట్‌లను ఐటీ అధికారులు పరిశీలించగా.. ఈ అక్రమ ఆర్థిక లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. మనోజ్‌ వాసుదేవ్‌ సన్నిహితుడు యోగేశ్‌ గుప్తా నివాసంపై కూడా ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. చంద్రబాబు ప్రభుత్వంలో స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ కుంభకోణంలో నిధుల మళ్లింపులో కూడా యోగేశ్‌ గుప్తా కీలక పాత్ర పోషించారు. బోగస్‌ ఇన్వాయిస్‌లు సృష్టించి ప్రజాధనాన్ని కొల్లగొట్టడంలో ఆయనదే ప్రధాన భూమిక.
- ఈ అక్రమ లావాదేవీలను మనోజ్‌ కోడ్‌ భాషలో తన ఈ–మెయిల్‌ ఐడీకే మెయిల్‌ చేసుకుని భద్రపరిచినట్టుగా ఐటీ అధికారులు గుర్తించారు. ఎవరెవరికి ఎంతెంత మొత్తం చెల్లించింది కోడ్‌ భాష 'టన్నుల' రూపంలో పేర్కొన్నట్టుగా పూర్తి వివరాలు వెల్లడయ్యాయి. హైదరాబాద్‌కు 3 టన్నులు, ఢిల్లీకి 3 టన్నులు, ముంబాయికి 3.5 టన్నులు.. ఇలా భారీగా నిధులను మళ్లించిన గుట్టును ఐటీ అధికారులు ఛేదించారు.

ఇదే రాష్ట్రం.. ఇదే బడ్జెట్‌

- ఇంతకు ముందు కూడా ఇదే రాష్ట్రం.. ఇదే బడ్జెట్‌. అప్పటి ప్రభుత్వం కన్నా అప్పుల గ్రోత్‌ రేటు ఇప్పుడు తక్కువ. ఇదే బడ్జెట్‌తో మన ప్రభుత్వం నేరుగా బటన్‌ నొక్కి డీబీటీ ద్వారా ప్రతి అక్క, చెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసి ప్రయోజనం కలిగిస్తోంది. నాలుగేళ్లు పూర్తికాక ముందే మన ప్రభుత్వం ఇప్పటికే రూ.2 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేసింది. ఎక్కడా లంచాలు, వివక్షకు తావు లేకుండా బటన్‌ నొక్కిన వెంటనే అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు వెళ్తున్నాయి.
- ఇంతకు ముందు చంద్రబాబు ప్రభుత్వంలో కూడా ఇదే బడ్జెట్‌. అయినప్పటికీ ఎందుకు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి, వారి కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు వెళ్లలేదు? ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? దోచుకో, పంచుకో, తినుకో అనే డీపీటీ స్కీం ఎలా చేశారో మొన్న కూడా చెప్పాం. ఈ రోజు మళ్లీ చెబుతున్నాం. గత ప్రభుత్వం ఎలా ఉండేది.. మనందరి ప్రభుత్వంలో ఎలాంటి మార్పు వచ్చిందో, ఎంత మంచి జరుగుతోందో రాష్ట్ర ప్రజలందరూ ఆలోచించాలి.



ఈడీ పట్టుకోదనే కేడీ చంద్రబాబు ధీమా

ఇంతగా ప్రజాధనాన్ని కొల్లగొట్టినా, తనను ఏ ఈడీ కూడా పట్టుకోదనే ఈ కేడీ చంద్రబాబు ధీమా. సీమెన్స్‌ కేసులో రూ.371 కోట్లు దోచేసిన చంద్రబాబు ఈ కేసులో రూ.172.44 కోట్లు దోపిడీ చేసినట్లు ఇప్పటిదాకా తేలింది. అమరావతి పేరిట ఏదో చేస్తున్నానని ప్రజలను మభ్యపెడుతూ ఇక్కడ చేసింది గోరంత.. కొట్టేసింది కొండంత. దోపిడీ ఆధారాలతో బయటకు వచ్చింది. ఇప్పుడు ప్రజలకు ముఖం ఎలా చూపిస్తావ్‌ చంద్రబాబూ.. అసెంబ్లీ, సచివాలయం తాత్కాలిక భవనాల నిర్మాణానికి చ.అడుగుకు రూ.12 వేలు చొప్పున దోచి పెట్టారు. బాబు దోపిడీలో దోచుకో పంచుకో తినుకో(డీపీటీ) బ్యాచ్‌లోని రామోజీరావుకూ వాటాలు అందాయి. – గుడివాడ అమర్‌నాథ్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

జిల్లా వార్తలు

ఫ్లాష్‌.. ఫ్లాష్‌...


రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

ఖమ్మం క్రైం: జిల్లా కేంద్రంలోని చర్చి కాంపౌండ్‌ వద్ద శుక్రవారం అర్ధరాత్రి 12.30గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం మేడేపల్లికి చెందిన యువకులు శివ(20), ఉదయ్‌(23), రవీందర్‌ శుక్రవారం ఖమ్మం వచ్చారు. పనులు ముగించుకుని రాత్రి 12గంటలు దాటాక స్వగ్రామానికి బయలుదేరారు. ఈక్రమంలో ఒకే వాహనంపై వెళ్తున్న ముగ్గురు అతివేగం కారణంగా చర్చి కాంపౌండ్‌ వద్ద డివైడర్‌ను ఢీకొట్టారు. తీవ్రగాయాలు కావడంతో వీరిలో శివ, ఉదయ్‌ అక్కడికక్కడే మృతి చెందగా.. రవీందర్‌ పరిస్థితి విషమంగా ఉంది. ఖమ్మం వన్‌టౌన్‌ పోలీసులు ఇచ్చిన సమాచారంతో అన్నం ఫౌండేషన్‌ చైర్మన్‌ శ్రీనివాసరావు మృతదేహాలను మార్చురీకి తరలించారు.

గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ

ఖమ్మం మయూరిసెంటర్‌/ఖమ్మం సహకారనగర్‌: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డిగ్రీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన బీసీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్‌ ద్వారా గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్‌ గౌతమ్, బీసీ స్టడీ సర్కిల్‌ డైరెక్టర్‌ జి.శ్రీలత వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోగా ఖమ్మంలోని స్టడీ సర్కిల్‌ కార్యాలయంలో అన్ని సర్టిఫికెట్లు, ఫొటోలతో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. కాగా, గతంలో బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవద్దని తెలిపారు. ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు ఎంపిక చేసి నిపుణులతో శిక్షణ ఇప్పించడమే కాక ఉచిత పుస్తకాలు, స్కాలర్‌షిప్, మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 08742-227427, 95738 59598 నెంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

ఆస్ట్రేలియా విద్యాసదస్సులో గువ్వలగూడెం వాసి


బ్రహ్మయ్య

నేలకొండపల్లి: ఆస్ట్రేలియాలోని టస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన విద్యాసదస్సులో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం గువ్వలగూడెంకు చెందిన వంగూరి బ్రహ్మయ్య పాల్గొన్నారు. స్టెప్‌ ఇన్‌ లీడ్స్‌ ఓవర్సీస్‌ అకాడమీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మయ్య తాజాగా ఐదు రోజుల పాటు జరిగిన సదస్సులో పాల్గొని విద్యావిధానంలో వస్తున్న మార్పులు, విద్య, ఉద్యోగావకాశాలు తదితర అంశాలపై జరిగిన సమీక్షల్లో పాలుపంచుకున్నారు.

శిశువును బతకనిద్దాం.. ఎదగనిద్దాం

- ఆడ, మగ సమానమేనని విస్తృత ప్రచారం
- గర్భస్థ పిండాలను చిదిమేయొద్దని అవగాహన
- లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట ప్రకారం నేరం

నేడు భ్రూణ హత్యల వ్యతిరేక దినం





భ్రూణహత్యల నిర్మూలనపై పోస్టర్లు విడుదల చేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు, కలెక్టర్‌ గౌతమ్, న్యాయమూర్తి జావేద్‌పాషా తదితరులు (ఫైల్‌) (ఇన్‌సెట్‌) ఖమ్మంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌

ఖమ్మంలీగల్‌: గర్భంలోనే పిండాన్ని చిదిమేయడం చట్టరీత్యా నేరం. కానీ ప్రస్తుత సమాజంలోనూ పలువురు ఆడపిల్ల కంటే మగపిల్లలకే ప్రాధాన్యత ఇస్తూ.. గర్భంలో పెరుగుతున్నది ఆడశిశువు అని తెలియగానే భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. ఈ అంశంపై ప్రభుత్వాలు అవగాహన కల్పించడంతోపాటు ఇలా చేసే వారిని శిక్షించేలా చట్టాలు తీసుకొస్తున్నా అడ్డుకట్ట పడడం లేదు. దీంతో అధికారులు చట్టాలను వివరించేలా అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేస్తుండగా.. ప్రభుత్వం సైతం ఏటా మార్చి 25న భ్రూణహత్యల వ్యతిరేక దినంగా నిర్వహిస్తూ సమాజంలో ఆడమగ సమానమేని చాటిచెప్పేలా కార్యక్రమాలు చేపడుతోంది. నేడు(శనివారం) భ్రూణహత్యల వ్యతిరేక దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

లింగ బేధంతోనే..

సమాజంలో ఉన్న లింగ బేధంతోనే భ్రూణ హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలుస్తోంది. ఆడపిల్లల కన్నా మగ సంతానానికి ఎక్కువ విలువ ఇవ్వడం వల్ల పిండం దశలోనే ఆడ శిశువు చిదిమివేయబడుతోంది. సాంస్కృతిక కట్టుబాట్లు ఇలాంటి దురాచారాలకు కారణమవుతున్నాయి. సమాజంలో ఆడ, మగ సమానమనే భావన అందరిలో కలిగితేనే భ్రూణహత్యల నియంత్రణ సాధ్యమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా తల్లిదండ్రులు ఈ అంశంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరముంది.

పరీక్ష చేస్తే జైలు, జరిమానా..

గర్భిణి ఆరోగ్యరీత్యా చికిత్స కోసం వైద్యుల సలహా మేరకు స్కానింగ్‌ సెంటర్ల నిర్వాహకులు గర్భంలో పెరుగుతున్న శిశువు ఆడా, మగా అనేది పరీక్షించాల్సి ఉంటుంది. కానీ చాలాచోట్ల స్కానింగ్‌ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలను విస్మరిస్తున్నారు. దీంతో ప్రభుత్వం గర్భస్థ పిండ పరీక్షల ప్రక్రియ –1994 చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం లింగ నిర్ధారణకు పాల్పడడాన్ని నేరంగా పరిగణిస్తారు. లింగ నిర్ధారణ చేసినట్లుగా రుజువైతే మూడేళ్లపాటు జైలుశిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తారు. అదే విధంగా వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యుడిని కొన్నేళ్ల సస్పెండ్‌ చేయడమే కాక వైద్య సర్టిఫికెట్‌ను రద్దు చేసే అవకాశం కూడా ఉంది. డయాగ్నోస్టిక్, స్కానింగ్‌ సెంటర్ల నిర్వాహకులపై కూడా క్రిమినల్‌ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవచ్చు.

నిరక్షరాస్యత, ఆర్థిక సమస్యలతో..

సమాజంలో నెలకొన్న నిరక్షరాస్యత, ఆర్థిక సమస్యలతో కడుపులో బిడ్డను కడుపులోనే చిదిమేస్తున్నారు. అక్షర జ్ఞానం లేకపోవడంతో పరిస్థితులను అర్థం చేసుకోలేని అమాయకత్వంతో ఆడపిల్లలు వద్దనే ఆలోచన ఇంకా తొలగిపోవడం లేదు. ఇక ఆర్థికపరమైన ఇబ్బందులతో అధిక సంతానం కలగడం వల్ల వారిని పెంచలేమనే ఆందోళన భ్రూణ హత్యలకు మరో కారణమని చెప్పాలి. భ్రూణహత్యలకు ప్రధాన కారణం తల్లిదండ్రులేనని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీనికి తోడు స్కానింగ్‌ సెంటర్ల నిర్వాహకులు పుట్టబోయేది ఆడ శిశువా, మగ శిశువా అని నిర్ధారణ చేస్తుండడం, డబ్బులకు ఆశపడి కొందరు ఆర్‌ఎంపీలు, కొన్ని ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో డాక్టర్లు అబార్షన్‌ చేస్తున్నా అధికారుల నిఘా లేకపోవడం భ్రూణహత్యలకు ఆగకపోవడానికి ఓ కారణంగా తెలుస్తోంది.

విస్తృతంగా అవగాహన

జిల్లాలో భ్రూణహత్యలను అరికట్టేందుకు న్యాయసేవాధికార సంస్థ, జిల్లా అధికార యంత్రాంగం ద్వారా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోస్టర్లు, హోర్డింగ్‌ల ద్వారా ఆడ, మగ ఎవరైనా సమానమేనని, లింగ నిర్ధారణ, అబార్షన్లు చేస్తే విధించే శిక్షలపై ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమాలతోనైనా జిల్లాలో భ్రూణహత్యలకు అడ్డుకట్ట పడాలని ఆశిద్దాం.

భ్రూణహత్యలు చట్టరీత్యా నేరం



లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం. పరీక్ష చేసిన వారితో పాటు, చేయించుకున్న వారు శిక్షార్హులవుతారు. భ్రూణహత్యల కారణంగా ఆడ, మగ లింగ నిష్పత్తిలో గణనీయమైన మార్పులు వచ్చాయి. దీనిపై పోస్టర్లు, హోర్డింగ్‌ల ఏర్పాటు, సదస్సులతో ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నాం.
– డాక్టర్‌ టి.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఖమ్మం

స్కానింగ్‌ సెంటర్లపై నిఘా



భ్రూణహత్యలతో ఆడపిల్లల మనగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముంది. నిబంధనలు విస్మరించే స్కానింగ్‌ సెంటర్లపై కఠినచర్యలు తీసుకోవాలి. అలాగే, ప్రజల్లో అవగాహన వచ్చేలా వివిధమార్గాల్లో విస్తృత ప్రచారం చేయాలి. న్యాయ సేవాధికార సంస్థ తరఫున పోస్టర్లు, హోర్డింగ్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నాం.
– మహ్మద్‌ అబ్దుల్‌ జావేద్‌పాషా, కార్యదర్శి, న్యాయసేవాధికార సంస్థ

జేకే ఓసీ విస్తరణకు భూముల పరిశీలన



పూసపల్లి అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్న అటవీ, సింగరేణి అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా పరిధిలోని జేకే ఓసీ విస్తరణలో భాగంగా పూసపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న భూములను ఆ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. సింగరేణి ఏరియా జీఎం ఎం.షాలేము రాజు ఆధ్వర్యాన అటవీశాఖకు సెంట్రల్‌ ఇంటిగ్రేటెడ్‌ రీజినల్‌ ఆఫీసర్‌ జి.త్రినాథ్‌కుమార్‌ తదితరులు పూసపల్లి అటవీప్రాంతంలో ఓసీ ప్రభావిత ప్రాంతంలో పర్యటించారు. జేకే ఓసీ విస్తరణకు సేకరించిన పూసపల్లి ఏరియాలో 151 హెక్టార్ల భూమి అటవీ ప్రాంతం కాగా, అనుమతి రావాల్సి ఉంది. ఈమేరకు సింగరేణి అధికారులు లేఖ రాయడంతో అటవీశాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. ఫారెస్టు అడ్వైజర్‌ సురేంద్ర పాండే, భద్రాద్రి సర్కిల్‌ సీసీఎఫ్‌ బీమా నాయక్, డీఎఫ్‌ఓ లక్ష్మణ్‌ రంజిత్‌నాయక్, ఎఫ్‌డీఓ అప్పయ్య, సింగరేణి అధికారులు రవిప్రసాద్, గణపతి, మల్లారపు మల్లయ్య, బాలాజీనాయుడు, నాగేశ్వరరావు, మహేశ్వర్, శివవీరకుమార్, ధనుంజరెడ్డి, శ్రీనివాస్, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూ పాలకమండలి సమావేశం

- అంచనాల బడ్జెట్, వార్షిక నివేదిక ఆమోదించే అవకాశం
- కోడిఫైడ్‌ సర్వీస్‌ రూల్స్‌పై కూడా చర్చ

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సమావేశం శనివారం హైదరాబాద్‌లో జరగనుంది. ఈ ఆర్థిక సంవత్సరం 2023–2024 అంచనాల బడ్జెట్, వార్షిక నివేదిక, అకడమిక్‌ స్టాండింగ్‌ కమిటీ నిర్ణయాలను చర్చించి అమోదించనున్నారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఉదయం 11గంటలకు ఫైనాన్స్‌ కమిటీ సమావేశం నిర్వహించి ఆదాయ, వ్యయాలపై చర్చించనున్నారు. ఆతర్వాత మధ్యాహ్నం 2గంటలకు పాలకమండలిలో రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్‌ నవీన్‌ మిట్టల్, విద్యాశాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ వాకాటి కరుణ, కేయూ వీసీ తాటికొండ రమేష్, ఇతర పాలకమండలి సభ్యులు పాల్గొని చర్చించాక ఆమోదిస్తారు. ఇదే సమావేశంలో యూనివర్సిటీ అకడమిక్‌కు సంబంధించిన అంశాలు, స్టాండింగ్‌ కమిటీలో నిర్ణయించి ఆమోదించిన వాటిపై కూడా మరోమారు చర్చించి ఆమోదించే అవకాశముంది. పలువురు ప్రొఫెసర్లను పరిపాలనా పదవుల్లో ఇప్పటికే నియమించగా, వీరి నియామకాలను ర్యాటిఫికేషన్‌ చేస్తారు.

ఉత్తమ అవార్డు ఎంపికపై చర్చ

దూరవిద్య కేంద్రంలోని కామర్స్‌ అండ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ కళాశాల ప్రొఫెసర్‌ టి.శ్రీనివాస్‌రావును గత విద్యాసంవత్సరంలో రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడి అవార్డుకు ఎంపిక చేయగా ఆయన అవార్డు అందుకున్నారు. అయితే, ఈ విషయమై విమర్శలు రాగా.. హిస్టరీ విభాగం ప్రొఫెసర్‌ టి.మనోహర్‌ తనకు రావాల్సిన అవార్డును శ్రీనివాస్‌రావును ఎలా ఇస్తారని యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఈ అవార్డు ఎంపికపైన పాలకమండలి సమావేశంలో చర్చించే అవకాశముందని తెలిసింది.

నాన్‌టీచింగ్‌ ఉద్యోగుల కోడిఫైడ్‌ సర్వీస్‌ రూల్స్‌పై కూడా..

కాకతీయ యూనివర్సిటీలో నాన్‌ టీచింగ్‌ ఉద్యోగుల కోడిఫైడ్‌ సర్వీస్‌ రూల్స్‌పై గతంలో రాష్ట్ర ఉన్నత విద్యాకమిషనర్‌ నవీన్‌ మిట్టల్, పాలకమండలి సభ్యులు డాక్టర్‌ నాగేంద్రబాబు, డాక్టర్‌ చంద్రమౌళితో కూడిన సబ్‌ కమిటీ వేశారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చిన నేపథ్యాన శనివారం జరిగే సమావేశంలో చర్చించి సర్వీస్‌రూల్స్‌ను ఆమోదించే అవకాశాలున్నాయి. ఇప్పటివరకు నాన్‌టీచింగ్‌ ఉద్యోగుల నియామకాలు, పదోన్నతులపై సర్వీస్‌ రూల్స్‌ లేకున్నా తీసుకుంటున్న నిర్ణయాలతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. దీంతో 2016నుంచి యూనివర్సిటీ ఉద్యోగులకు ప్రత్యేకంగా కోడిఫైడ్‌ సర్వీస్‌ రూల్స్‌ కావాలని డిమాండ్‌ చేస్తుండగా, తాజా సమావేశంలో ఆమోదించే అవకాశముందని తెలుస్తోంది.

పెద్దమ్మతల్లి ఆలయ పాలకమండలికి మోక్షం

పాల్వంచరూరల్‌: ఆరు నెలల తర్వాత పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ పాలకవర్గానికి మోక్షం లభించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం జీఓ జారీ చేసింది. ఈ కమిటీ పాలకవర్గ గడువు గతేడాది అక్టోబర్‌ 9న ముగియగా, కొత్త కమిటీని తిరిగి నియమించలేదు. గత కమిటీలో 12 మంది సభ్యులు ఉండగా, అదనంగా ముగ్గురిని కలిపి 15 మంది సభ్యులతో నూతన కమిటీని నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి వి.అనిల్‌కుమార్‌ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో మహిపతి రామలింగం, చింత నాగరాజు, గంధం వెంగళరావు, ముత్యాల ప్రవీణ్‌కుమార్, ఆడెపు చిన్నవెంకట్రామయ్య, బండి చిన్న వెంకటేశ్వర్లు, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, మాలోతు సువాలి, కాటారపు లక్ష్మీనారాయణ, కిలారు నాగమల్లేశ్వరరావు, ఎస్వీఆర్‌కే.ఆచార్యులు, బేతంశెట్టి విజయ్‌కుమార్, సంకా వెంకటరామరావు, పాయం పాపయ్యతోపాటు అర్చకులు రవికుమార్‌శర్మ ఉన్నారు. కాగా, కమిటీ నియామకంపై తమకెలాంటి సమాచారం అందలేదని ఈఓ ఎస్‌.రజినీకుమారి తెలిపారు.